# బడిమీదొట్టు



ఇచ్ఛాపురపు రామచంద్రం

"మాస్టారూ! మీరు సీనియరు. మేమేమో ఇప్పుడే టీచరుగా చేరుతున్నవాళ్ళం. మాకు మీ సందేశం... అవే మెలకువలు.. మసులుకోవలసిన పద్ధతులు చెప్పరూ? టీచరుద్యోగం ఎలా చేసుకోవాలో వివరించరూ?" కొత్తగా టీచర్లగా చేరుతున్న ఆ ఇద్దరూ అలా అడిగేసరికి వారి వినయవిధేయతలకి నాకు ముచ్చటేసింది. మురిపించుకోకుండానూ, బతిమాలించుకోకుండానూ, "నా తొలి రోజుల.. అంటే ఐదారేళ్ళ కిందట అనుభవం చెబుతాను. ఆ వృత్తాంతం నుంచి మీరు గ్రహించగలిగింది తీసుకోండి. అన్నట్లు.. నేను చెబుతున్నది ఐదారేళ్ళ కిందట సంగతి. అందుచేత విద్యారంగం పరిస్థితుల లోనూ, పద్ధతులలోనూ కొన్ని తేడాలుంటాయి," అని జాగ్రత్తలు చెప్పి మొదలుపెట్టాను.

* * *

ఇక ఈ జీవితానికుద్యోగ యోగం లేదని నిస్పృహకి లోనవుతూండగా వచ్చిందో ఉద్యోగం.

మూడు వేపులా కొండలు. వాటిలో చాలావరకూ మొక్కా మోడూ లేని బోడికొండలే. రాళ్ళు దొల్చివేయబడిన ఆ కొండలు క్షతగాత్రులని తలపుకి తెచ్చేలా ఉన్నాయి. కొండల్ని డిటోనేటర్లతో పేల్చి.. స్టోన్‌క్రషర్ యజమానులు పిక్కరాతినీ - రాతి పిండితో తయారుచేసిన ఇటుకలనీ పట్నాలకు పంపుతారు. అదే ప్రధాన వ్యాపారం అక్కడ. గాలిలో కనిపించీ

కనిపించకుండా రాతి ధూళి (ఫ్లయ్ యాష్). భూములు మెరక భూములు. తాగు నీరే కరువు. ఇక సాగునీరు కూడానా! అంచేత అక్కడ భూమిని తవ్వేసి ఆ మట్టితో రాతిపిండిని కలిపి ఇటుకలు తయారుచేస్తుంటారు. పెద్దపెద్ద గోతులు పడిన భూమి, బోడికొండలు.. సుందరంగా ఉండవలసిన పల్లె ప్రకృతి పరమ వికృతంగా భయంకరంగా గోచరించింది నా కంటికి. నిరుత్సాహాన్ని, బాధనీ కలుగజేసి వదిలింది. వ్యాపార సంస్కృతంటే - ప్రకృతిని వికృతి చేయడమేనా అనిపించి ఆవేదన కలిగేది. ప్రపంచంలో అత్యధికంగా దోచుకోబడేది ప్రకృతే ఏమో స్త్రీకంటే కూడా అని అనుమానం కలిగేది ఊరి పరిసరాలను పరికిస్తుంటే.

పోనీ వూరి మేరకయినా బాగుందా అంటే -

గాలిలో రాతి ధూళి కంటికి స్పష్టంగా కనిపించనిది - కనీసం.

కానీ -

ఆ పల్లె పేదరికం నగ్నంగా విస్పష్టంగా కనిపించిపోతుంది. పూరి గుడిసెలు, నామమాత్రపు బాట. దానిమీదకు ఇళ్ళల్లోంచి పారుతున్న వాడకపు మురుగు నీరు కంపు. ఆ మురికి నీటిలో పందులు. వాటికంటే ఆట్టే మెరుగ్గా కనిపించని పూర్ పిపుల్. గుండెల్లోంచి దేవుతున్నట్లయింది. గుండెల్లో రాయి పడింది. అప్పుడే నా భుజం మీద చెయ్యి పడింది. అటు చూడగా కాలేజీలో నాతో కలిసి చదివిన శేషు!

"శేషూ! నువ్వు.. ఇక్కడ.." నమ్మలేక పోయాను.

"నీలాగ వచ్చినవాడినే" నవ్వాడు. "పెట్టబోయే బడికి నీతోపాటు నేనూ టీచర్‌నే." ఒక్కసారి గుండెలమీంచి బండ తీసేసినట్లు మనసు తేలికయింది. శేషు సామాన్యుడు కాడు. అతనిలాంటివాడు తోడుంటే అసాధ్యాలనేవి అరుదు. ఉద్యోగంకాని మా ఉద్యోగం మామూలిది కాదు. కొంచెం కొత్త తరహాది. నిర్బంధ ప్రాథమిక విద్య అని పైకి అనకుండానే దానినమలుపరచడానికి ప్రభుత్వం ఒక పథకం రూపొందించింది. దాని ప్రకారం ఇంతవరకూ బడి ముఖం ఎరుగని 5 నుండి 14 సంవత్సరాల మధ్య వయసుగల బాలబాలికలలో అర్హులయిన వారిని నమోదు చేసి, వారికోసం బడి తెరిచి వాళ్ళనందరినీ బడిలో చేర్పించాలి. అప్పుడు చదువు చెప్పడం మొదలెట్టాలి. తగిన సంఖ్యలో పిల్లల్ని సేకరించలేక పోతే టీచర్ల సంఖ్య తగ్గిపోడమో, బడి తెరవకపోడమో కూడా జరగొచ్చు. అందుచేత మాకిది పెద్ద సవాలే. రేపటి ఉద్యోగానికి మెట్టు. "ఏమిటో... బడికి పిల్లల్ని రప్పించడమూ.. జనాభా లెక్కల సేకరణా.. జన్మభూమి వగైరా కార్యక్రమాలు. ఎన్నెన్ని బోధనాంతర పనులు టీచర్ పీకల మీదకి..." విసుగ్గా అన్నాను.

"ఐతేనేం? జీతం బాగానే ముడుతుందిగా? బతకలేక బడి పంతులు కాదిప్పుడు. బతకాలనుకుంటే బడిపంతులు. మన లాటి నిరుద్యోగులకి టీచరుద్యోగమంటే పస్తులుండేవాడికి పిలిచి పరమాన్నం పెట్టడమే.." అన్నాడు శేషు.

"కానీ ఇక్కడ చూడబోతే అందరూ దరిద్రనారాయణుల్లాగే ఉన్నారు. ఇకవాళ్ళు పిల్లల్ని బడికేం పంపిస్తారు?" నా భయం అతని ముందుంచాను.

"ఆ దారిద్ర్యం నిజమయింది కాదు. కావాలని తెచ్చిపెట్టుకున్నది. చుట్టుపక్కలున్న క్వారీలు, క్రషర్లు. ఇటుకబట్టీలు... వీళ్ళకి పనీ, డబ్బూ కూడ బాగానే ఇస్తారు."

"మరి?"

"కానీ, మగాడికి సాపాటు కంటే సారా మొదటి అవసరం.

"స్త్రీకి?"

"చీరకంటే కూడా సినిమాయే ముఖ్యావసరం. అనకాపల్లో, చోడవరమో వెళ్ళి సినిమా చూసొచ్చె య్యాల్సిందే సొమ్ము చేతిలో ఉంటే. యథా తల్లి తండ్రులు, తథా పిల్లలు. అంతమాత్రాన మన మేమీ తోకముడవక్కర్లేదు. చిత్తశుద్ధితో కష్టపడితే, ఉద్యోగం మనది." భరోసా ఇస్తున్నట్లే అన్నాడు శేషు. అతని మాటలతో నాకూ ఆశా, ధైర్యమూ వచ్చాయి.

ఊరిలోనూ, దానికి కిలో మీటరు పరిధిలోనూ చదువీడు పిల్లలున్న కుటుంబాల వివరాలు సేకరించగా చదువుకోదగిన పిల్లల కుటుంబాలు తొంభై రెండు తేలాయి. ఆ కుటుంబ పెద్దలను - తమ పిల్లలని బడికి పంపేలా ఒప్పించడానికి బయలుదేరాం.

"విద్యయొసగును.." పద్యం చదివి విద్య లాభాలేకరువుపెట్టాం రాగయుక్తంగా. చదువు కోకపోతే వచ్చే నష్టాల మీద ఉపన్యాసం. బాల్యం



## త్వరలో తెలుగు తెరపైకి!

మాజీ ప్రపంచ సుందరి డయానా హెడెన్ త్వరలో తెలుగు సినిమా చేయబోతున్నట్లు టాలీవుడ్ ఉవాచ! ఇప్పటికే హిందీ 'తెహ్‌జీబ్' సినిమాలో నటించిన ఈ అమ్మడికి తెలుగు బాగానే వచ్చు. గత రంజాన్ నెలలో చాలా రోజులు హైదరాబాద్‌లో గడిపినట్లు ఆమె బంధువులు చెబుతున్నారు. ఇదే సమయంలో తెలుగు సినిమా నిర్మాతలు కొందరు ఆమెని కలిసినట్లు బోగట్టా! తెలుగులో నటించడం జరిగితే తనే స్వయంగా డబ్బింగ్ చెబుతానని డయానా చెప్పడం విశేషం! తెలుగు వారై ఉండి కూడా తెలుగు డబ్బింగ్ చెప్పడానికి ఏవేవో సాకులు చూపే హీరోయిన్లు ఈమెని చూసైనా కొంత మారతారేమో చూద్దాం!

## నూత్న వత్సరానికి స్వాగతం

రెండువేల నాల్గునకు శుభస్వాగతం
విశ్వంలో పయనించ మాకు సమ్మతం
సర్వజనులకందించు నిత్యానందం
మా జోతలందుకోవమ్మా! నూత్నవత్సరం
॥రెండువేల॥
నిన్న చేదు సంఘటనలు-నిన్నటితో సమాప్తం
నేటి తీపి అనుభవాల వత్సరంలో అడుగిడుదాం
ప్రశాంతి పవన వీచికలను ఆస్వాదిద్దాం
పికస్వర గానాలతో ఆగతమందాం ॥రెండువేల॥
విద్యార్థికి, ఉద్యోగికి వృద్ధికరమందాం
శ్రీమంతుడు-బీదవాడు(అని) చూపకూడదు
తారతమ్యం
సద్వర్తన పాలనతో - సచ్ఛీల భావనతో
అందించాలి ఆనందం
నూత్నవత్సర వినోది-స్వాగతం-నమస్సుమం
శుభకరం ॥రెండువేల॥

- విద్వాన్ కో.శ్రీ.

గొప్పతనం అన్నీ చెప్పాం. వాళ్ళు మేం చెప్పిందంతా ఓపిగ్గా విని, అప్పుడు -

"మాకెందుకు బాబూ సదువు.. ఇలా పోనీండి మమ్మల్ని."

"మా తాత సదవనేదు. మా అయ్య సదవనేదు. నేను సదవనేదు. నా పిల్లలకి మాత్రం సదువేల?"

"ఆడగుంట. పెళ్ళి చేసుకుని పెనివిటికి పొయ్యూదుకుంటూ కూడొండవలసింది దానికి సదువెందుకు? ఉజ్జోగాలు సెయ్యనా, ఊళ్ళేలనా?"

"బాబులూ.. నాకు తెలవకడుగుతాను. పెద్దపెద్ద చదువుల్చదివినోళ్ళే పనుల్లేక ఈదుల్లో ఊరకుక్కల మాదిరి తిరగతన్నారు. ఆల్లు చాలరూ? మావోల్లు కూడా ఆల్లల్లో జేరితే అనకాపల్లి రోడ్లు చాలవు."

"ఇలాటివి మా ఇంటా వంటా నేవు, మీరు కొత్తగా తెచ్చిపట్టమాకండి."

"సదుంకున్నోల్లకంటే సాకలోళ్ళు మేలంటారు. మేం సాకలోల్లమే."

"మా బొట్టుడాఫనికీ యీ పనికీ పోయి రోజా పదీ పరకా తెత్తన్నాడు. ఆణ్ణి పని మానిపించి బడికి తోలితే మా ఇల్లు గడిసేదెలా?"

"మా పిల్లది పుల్లలేరుకు రాపోతే కూటికుండ పొయ్యెక్కేదెలా?"

"ఏన్నీల్లకి సన్నీల్లలా మా వోడు తెచ్చే ఐదూ పదీ తేకుండా బడికేగితే మా బువ్వ బుగ్గే బూడిదే".

"మా వోడు మొద్దు. మీ శ్రమ దండగే కానాడికచ్చరమ్ముక్కబ్బదు."

"మా ఇంటికి సరస్వతీదేవి శాపముంది. మాకు సదువుండదు. ఉండకూడదు."

"గొడ్లు కాసుకుంటూ గూటిబిల్లాడుకోడమే ఇష్టం. సదుమ్మీద ద్యాసుండదు. ఐనా కుర్రోళ్ళు బడికి పోతే బర్రెలెవరు కాత్తారు?"

"దేనికేనా పూర్వజలమ పున్నెముండాలి. అది లేందే ఈ జలమలో ఏదీ అంటదు. కాకిని తీసికెళ్ళి గంగలో ముంచితే మాత్రం కపోతమౌద్దా?"

"పిల్లోల్లని పన్లోకి పంపకపోతే మాకు రోజు గడవదు. ఎద్దెండకిలాగ, ఏనుబోతు నీడకి లాగ అన్నట్లు మేమేమో పనిలోకి మీరేమో బడిలోకి లాగబోతే ఆళ్ళు రెండింటికీ సెడ్డ రేవళ్ళవుతారు."

"ఈ సదువులు కడుపు నిండిన మారాజులగ్గాని మాలాటి పూటబత్తెం, పుల్లవెలుగు గాళ్ళకి కాదు."

"నేను బట్టీకి బొట్టి బడికి పోతే గుడిసెలో వుండి సంటిదాన్ని చూసుకునే దిక్కెవరు?" -

అంటూ వీళ్ళు రకరకాల అభ్యంతరాలు లేవనెత్తుతూంటే నా తల తిరిగిపోయింది. కానీ, కాలేజి రోజుల్లోనే మంచి వక్తా, విద్యార్థి నాయకుడూ అయిన శేషు -

"మీరు పెద్దవాళ్ళు. పిల్లల తల్లితండ్రులు. మీరే ఇలా అమాయకంగానూ అన్యాయంగానూ మాట్టాడడం మాకాశ్చర్యంగా ఉంది. పసిపిల్లల చేత పని చేయించి వారి కష్టం మీద మీరాధార పడటం మీకు పరువూ కాదు, పౌరుషమూ కాదు. బడికి పంపవలసిన వయసులో బండరాళ్ళు బద్దలుకొట్టే శ్రమకి గురిచేస్తే ఆ పిల్లల్లో ఎదుగుదలుండదు. పలక పట్టవలసిన పసివాళ్ళ చేత పలుగులు పట్టిస్తుంటే, వయసుకు మించిన కష్టం వల్ల వాళ్ళు కునారిల్లి (కృశించి) పోయి, వయసొచ్చినా తగిన శరీరం లేక మరుగుజ్జుల్లా మిగిలిపోయి బతుక్కీ, పెళ్ళికీ కూడా పనికి రాకుండా పోతారు. అలాటి పాపం మూటగట్టుకుంటారా? ఏ వయసుకాకళ అని ఊరికే అనలేదు మీవంటి పెద్దలు" ఒకసారూపిరి పీల్చుకుని.

"విద్య లేనివాడు వింత పశువనేది కాలంతోపాటు నిగ్గు తేలుతున్న నిజం. ఇవి మీ రోజులు కావు. మా రోజులూ కావు. పిల్లల రోజులు. నీటిని మూటగ కట్టవచ్చునే అని పూర్వులంటే - విద్యావంతులయిన నేటి వారు నీటిని మూటకట్టి వాటర్ ప్యాకెట్లుగా అమ్ముతున్నారు. మనం తాగుతున్నాం. ఇలాటివన్నిటినీ అర్థం చేసుకుంటూ ముందుకు సాగాలంటే ప్రతివాళ్ళకీ చదువవసరం. బస్సుమీది ఊరిపేర్లు.. ఏ సినిమా ఏ హాల్లో ఆడుతోంది ఇలాటివి కూడా మరొకరినడగం ఎంత చిన్నతనం. వేలిముద్రకి ఎదురయ్యేది వెక్కిరింతలే. మనిషి ఎదుటివాడి చేతిలో మోసపోకుండా ఉండాలన్నా విద్య అత్యవసరం. మీ పిల్లలకి విద్యలేక చిన్నతనం పడితే, ఆ బాధ్యత మీదే ఔతుంది మరి.." మరోసారి ఊపిరి పీల్చుకుని

"ప్రభుత్వోద్యోగాలు తగ్గినమాట నిజమే. కానీ చేతిలో విద్యుంటే ప్రభుత్వోద్యోగమే అనేముంది? రకరకాల ఉద్యోగాలు. భూమిని దున్ని సేద్యం చేస్తే కొందరికి ఎక్కువ పంట వస్తుంది. కానీ, కొంచెమయినా రాకుండా ఎప్పుడూ ఉండదు. అలాగే విద్యకుద్యోగం విషయమూను. అదృష్టమున్నవారికి పెద్ద ఉద్యోగాలు వస్తాయి. ఇవాళ రాజకీయ నాయకులుగా, మంత్రులుగా, గొప్పవాళ్ళుగా ఉన్నవారెందరో పల్లెల నుంచీ పేద కుటుంబాల నుంచీ చదువుకుని వచ్చినవారే!" అంటూ సినిమా తారలతోసహా కొన్ని ప్రముఖమయిన పేర్లు ఉటంకించి -

"త్వరలోనే ప్రభుత్వం పిల్లలకు నిర్బంధ విద్య అనే పథకం ప్రవేశపెట్టబోతోంది. అప్పుడు బడి వయసు పిల్లల్ని బడికి పంపకపోయినా, పనుల్లోకి పంపినా పెద్దవాళ్ళకి జెయిలు శిక్షే. అంచేత.. మీ క్షేమం కోరి యివాళ మీరు మీ అంతట మీ పిల్లలని బడికి పంపకపోతే రేపు మీ పిల్లలు బడికి వెళ్ళడమూ, మీరు జెయిలుకెళ్ళడమూ కూడా తప్పదని ముందే చెబుతున్నాను." అంటూ చిన్న బెదిరింపు బెదిరించి -

"బడికొచ్చే పిల్లలకి బియ్యం ఇస్తుంది ప్రభుత్వం. మధ్యాహ్నం భోజనం పెడుతుంది. అందువలన మీ పిల్లలు పనికి కాక బడికి వెళ్ళినా వాళ్ళవల్ల కొంత సాయం మీకందుతూనే ఉంటుం"దని ఆశ పెట్టాడు. ఎలాగైతేనేం డెబ్బయి మందిని బడిలో చేర్చాము. భావి కర్తవ్యాలు నిర్ణయించుకుందుకు సాయంత్రం ఓ కొండపైకెక్కి శిఖరాగ్ర సమావేశం జరిపాం నేను శేషూ.

"ఇక నుంచి గుర్రప్పిల్లలచేత చదువునీళ్ళు తాగించాలి. కష్టపడి సంపాదించిన పిల్లలు బడినుంచి జారిపోకుండా చూసుకుంటూ.. క్రమశిక్షణకి పెద్ద పీట వేస్తూ పాఠాలేకాక పిల్లలకాసక్తి కలిగించే ఇతర విషయాలు, కథలూ చెప్పాలి. ఆటలాడిస్తూ.. పాటలు పాడిస్తుండాలి. పాఠాలు బోధించేటట్టుకాక పిల్లలకి చెప్పడం అనే ఫక్కీలో ఉండాలి. మనం ఆదర్శ ఉపాధ్యాయులుగా ఉంటూ పిల్లలని ఆదర్శ విద్యార్థులుగా తీర్చిదిద్దుతూ మంచి ఫలితాలు సాధించాలి" అని తీర్మానించుకున్నాం.

మరునాడే బడి తెరిచాం. బడి ఆవరణను పరిశుభ్రంగా ఉంచడం.. సకాలంలో ప్రార్థన. రెండు పూటలా హాజరు సరి చూడడం. చివరి గంటలో ఆటలు, పాటలు.. పాఠాలు చెప్పడంలో కొత్త పద్ధతులవలంబిస్తున్నాం. హోమ్ వర్క్, హాజరు విషయాలలో రాజీపడడమనే ప్రశ్నేలేదు. అలాగ రెండు నెలల గడిచాయి. ఊళ్ళో మా బడికీ మాకు మంచి పేరొస్తోంది. అప్పుడు...

* * *

నాలో అలజడి, ఆందోళన, ఆగ్రహమూ. కారణం అప్పలకొండ.

మొన్న మధ్యాహ్నం రెండున్నరకి.. అంటే గంట ఆలస్యంగా వచ్చాడు, ఉదయం మామూలుగానే వెళ్ళినా. మొదటిసారీ, అప్పలకొండ కదా అని ఊరుకున్నాను. ఎందుకంటే అప్పలకొండ

తెలివయినవాడు. బాగా చదువుతాడు. హోమ్ వర్కు శ్రద్ధగా చేసుకొస్తాడు. దస్తూరీ ముత్యాల కోవే. కొనుక్కోమనగానే నోట్ బుక్కు కొనుక్కుంటాడు. తోటి పిల్లలతో సఖ్యంగా మసులుకుంటాడు. ఆటపాటల్లోనూ ముందుగానే ఉంటాడు. అందుకే వాడిమీద నాకెన్నో ఆశలూ, ఎంతో ఇష్టమూ. నీటుగా బడికొస్తాడు. టీచర్లంటే ఎంతో భక్తీ గౌరవమూ. పల్లెటూరి యాసనిట్టే వదుల్చుకుని పదాలను సరిగా చక్కగా ఉచ్చరించే అప్పలకొండ మా బడికాశాకిరణమే. కానీ, మొన్న ఉదయం బడికి పువ్వులా వచ్చినవాడు మధ్యాహ్నం మాత్రం మట్టికొట్టుకుపోయి.. వాడిపోయీ.. ఆలస్యంగానూ వచ్చాడు. అయినా ఊరుకున్నాను. నిన్నా అలాగే చేశాడు. పోనిలే.. రేపు కూడా ఆలస్యంగా వస్తే చూద్దాం అనుకున్నాను.

ఇవాళ.. ఇప్పుడు రెండుంపావు దాటిపోయింది. అయినా వాడింకా రాలేదు. గతంలో కూడా ఎప్పుడేనా ఓసారి ఇలా ఆలస్యంగా వస్తూండేవాడు, కానీ ఇలా అలవాటుగా కాదు. అంగట్లో అన్నీ ఉండీ అల్లుడి నోట్లో శనన్నట్లు అప్పలకొండకీ ఆలస్యం జాడ్యమేమిటీ? దీన్ని ఆదిలోనే అంతం చెయ్యాలి. లేకపోతే క్రమశిక్షణా రాహిత్యం ముదిరి వైరస్‌లా వ్యాపించి వాడినీ, మిగిలిన కుర్రాళ్ళనీ కూడా పాడుచేస్తుంది.

ఒకసారి మందలించినా లెక్కలేకపోయిందంటే అప్పలకొండలో వ్యాధి ముదిరిందనీ, తాట వొలిస్తే తప్ప మాటలకి లొంగడనీ అన్నమాటే. 'స్పేర్ ద రాడ్, స్పాయిల్ ద చైల్డ్' వీడికి వర్తిస్తుంది. దండం దశగుణం భవేత్. శిక్షణను సాధించడానికి గత్యంతరం లేకపోతే శిక్షణనాశ్రయించినా తప్పులేదు. పాఠం చెబుతూనే ఓ కన్ను ద్వారంవేపు వేసిఉంచాను. రెండున్న దాటుతోంది.

"సర్" చెప్పి క్లాసులోకి వచ్చెయ్యబోయాడు అప్పలకొండ.

"ఆగక్కడ!" అరిచాను. నా కంఠంలోని తీవ్రతకు బిత్తరపోయాడు కాబోలు, అక్కడే నిలబడిపోయాడు. బట్టలు నలిగి.. జుత్తు చెదిరి.. ముఖం వాడిపోయి జిడ్డోడుతూ.. ఎలా వుండాలంటే అలా వుంది వాడవతారం.

"టైమెంతయింది?" బెత్తం పట్టుకుని నేనే వాడివేపు నడిచాను.

తల వంచుకున్నాడు. తప్పు చేసినవాడు తలొంచుకోక ఏం చెయ్యగలడు?

"రెండున్నర" నేనే చెప్పాను.

"ఇప్పుడా రావడం? మధ్యాహ్న తరగతులెప్పటి నుంచి మొదలౌతాయి? ఒంటిగంటన్నర.. అంటే గంట లేటుగా వచ్చావన్నమాట!"

"......"

"ఏం చేస్తున్నావింతసేపు? పన్నెండు నుంచి రెండున్నర వరకూ భోజనమే చేస్తున్నావా? బకాసురిడివా? వాడికైనా ఇంతసేపు పట్టదు తిండికి."

పిల్లలు గొల్లున నవ్వారు. వీళ్ళకి మొన్ననే బకాసురుడి కథ చెప్పాను. వీళ్ళకి "సైలెన్స్" అని అరిచి అప్పలకొండనెదుర్కున్నాను.

"బడెగ్గొట్టి బలాదూర్లు తిరుగుతున్నావా? ఏ తోటల్లో కాయలో దొంగతనంగా కోసుకు తింటున్నావా?"

వాడు నోరు తెరవకుండా లేదన్నట్లు అడ్డంగా తలూపాడు. నా సహనం చచ్చిపోతోంది వాడి మౌనానికి. వాడికి మరింత దగ్గరగా వెళ్ళి -

"చెప్పకపోయావో చంపేస్తాను, ఏం? నోరు లేదా? వెధవ పనులు చెయ్యడానికయితే.. ధైర్యమే. నిజం చెప్పడానికి నోరు పెగలదు. నిన్ను చదివించడానికి మీ అయ్యో, అమ్మో ఎన్ని పాట్లు పడుతున్నారో నీకేమైనా తెలుసా? చదువూ సంధ్యా మాని బడెగ్గొట్టి. ఆటలాడతావా ఎండలో. మూడు రోజుల నుంచి ప్రతి మధ్యాహ్నమూ లేటే. ఈ వేళలో ఏం చేస్తున్నావ్?" గద్దించాను బెత్తమెత్తి ఒక్కటేసి. వాడు తలెత్తాడు. వాడి కళ్ళనిండా నీళ్ళు. కాని నాకు తెలుసు. అవి నా చిన్నదెబ్బ కలిగించిన బాధవల్ల వచ్చినవి కావు. ఆటల్లో చూస్తుంటానుగా, అప్పలకొండ చాలా మొండి. నేను వదలననుకున్నాడో ఏమో ఈ సారి వాడు నోరు తెరిచాడు. ఎన్నాళ్ళనుంచో అతి గోప్యంగా గుండెల్లో దాచుకుంటూ వస్తున్న రహస్యాన్ని విధిలేక చెప్పవలసి వస్తున్నట్లు.. వెక్కుతూ వెక్కుతూ గొణిగాడు.

"మా అయ్యకీ అమ్మకీ నేను బడికి రావడం ఇష్టం లేదు సారూ. అందుకని నా బడి బట్టలక్కాని బుక్కులుకి కానీ వాళ్ళు డబ్బులివ్వరండి."

"అబద్ధం.. ఆటలు మరిగి అబద్ధాలాడుతున్నావ్. అయినా నువ్వు చెప్పేదానికీ బడికి లేటుగా రావటనికీ ఏమిటి సంబంధం?" అరిచాను.

"అబద్ధం కాదండీ. సత్యమండీ. కొత్త బుక్కు తెమ్మని మీరు మొన్న చెప్పారుకదండీ, ఇంట్లో అడిగేనండి డబ్బులిమ్మని. అప్పుడు మా అయ్య - నీ బడి కర్సు నువ్వు సంపాదించుకోగల్గితే సదువుకో, లేపోతే మానెయ్ అనేసేడండి."

"ఐతే!"

"అమ్మా, అయ్యా ఇవ్వకపోతే నాకుడబ్బులెలా వస్తాయి ఏం కొనుక్కోవాలన్నా? బుక్కుకి డబ్బులు సంపాయించుకుందుకే మొన్నా, నిన్నా, ఇవేళా బట్టీకెళ్ళి ఇటికలు మోస్తున్నానండి. వందిటికలు మోస్తే రెండ్రూపాయలిస్తారండి. ఇటికల మోత మజ్జాన్నమే ఉంటదండి. బడి చదువుకేది కొనాలన్నా నేనిలాగే సంపాదించుకోవాలండి. నేనెళ్ళేది బలాదూరు తిరగడానిక్కాదండి. ఇది నిజమండి. సత్యమండి. నామీదొట్టండి. సరస్వతీ దేవి మీదొట్టండి. బడిమీదొట్టండి. సారూ! నాకు బడన్నా మీరన్నా చాలా ఇష్టమండి. బడి లేకపోతే... బడికి రాకపోతే బతకలేనండి" భోరున ఏడిచేశాడు వాడు.

వాడిమీదా, వాడి పరిస్థితిమీదా నాకు జాలేసింది.

"మరి ముందే ఎందుకు చెప్పలేదు?"

"సిగ్గేసిందండి. నలుగుర్లోనూ చెప్పుకుందుకు చిన్నతనమనిపించిందండి. సారూ! మీరు బట్టీవాళ్ళమీద రిపోర్టివ్వకండి. తప్పు వాళ్ళది కాదు. నేను బతిమాలితేనే పనిచ్చారు. పనివ్వకపోతే నాకు డబ్బులుండవు. డబ్బులుండకపోతే బడుండదు. బడి లేకపోతే సారూ, నేస్తాలు, ఆటలు, పాటలు, కథలు.. ఏవీ ఉండవు. నాకు బడంటేనే బతుకు సారూ నిజంగా.."

నా తొందరపాటుకి సిగ్గూ, పశ్చాత్తాపమూ కలిగాయి. అప్పలకొండ పసిమనసునంత కష్టపెట్టినందుకు నేనే వాడిని క్షమాపణ కోరాలి. కానీ, అప్పటికే వాడు నా కాళ్ళమీద పడి కన్నీరు కారుస్తున్నాడు.

వాడిని లేవనెత్తి ఆదరంగా ఆప్యాయంగా కౌగలించుకున్నాను.

ఆ స్పర్శలో నాకు ఎంతో స్వాంతన లభించింది. నా నేరాన్నీ పాపాన్నీ కడిగేసుకున్నట్టయింది.

*

